భగాయత్ బస్తీల అభివృద్ధికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్: రామంతాపూర్ భగాయత్ బాల కృష్ణనగర్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భగాయత్ బస్తీల అభివృద్ధికి కృషిచేస్తానని, పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూ.74,40,000 నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే డ్రైనేజీ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. నియోజకవర్గంలో రాజకీయాలకు తావు లేకుండా అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేశామని స్పష్టం చేశారు. మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్నానాగేశ్వర్ రావు, కాలనీ అధ్యక్షుడు స్వామి, మహేశ్వర్‌రెడ్డి, జహంగీర్, నరసింహారెడ్డి, జర్నలిస్టు విజేందర్ రెడ్డి, నాగేష్, రాములు, సూరం శంకర్, చాంద్‌పాషా, నరేష్, పవన్, ప్రశాంత్‌గౌడ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షతో ఆధ్యాత్మికం, ఆనందం



మహాపడిపూజలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

రామంతాపూర్: శ్రీనివాసపురంలోని వల్లపు మల్లేష్‌యాదవ్, జగన్‌యాదవ్, శ్రీకాంత్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప మహాపడిపూజ అయ్యప్పస్వామి భజన గీతాలతో వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్. ప్రభాకర్ మాట్లాడుతూ.. కఠిన నియమాలతో ఉండే అయ్యప్ప దీక్షతో మనస్సుకు ఆధ్యాత్మికత, ఆనందంతో పాటు ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. పలువురు గురుస్వాములు పాల్గొని భజన గీతాలు ఆలపించారు.

బస్ రూట్లను పెంచండి

అల్వాల్: నియోజకవర్గం పరిధిలోని మచ్చబొల్లారం, వినాయక్‌నగర్, గౌతంనగర్, మౌలాలి డివిజన్లలో అదనంగా బస్ రూట్లను పెంచాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. పలు అభివృద్ధి పనులు చేపట్టాలని మంగళవారం మంత్రికి వినతిపత్రం అందజేశారు. అన్ని డివిజన్లలో మరిన్నీ బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని విన్నవించారు.

ఫోరం ఆధ్వర్యంలో పెన్షనర్ల దినోత్సవం

గౌతంనగర్: సెంట్రల్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం మధుసూదన నగర్‌లో పెన్షనర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షుడు ఎస్.రామారావు పెన్షనర్ల దినోత్సవ విశిష్టతను వివరించారు. అనంతరం 80 ఏళ్లు నిండిన సీనియర్ పెన్షనర్లను శాలువాతో ఘనంగా సత్కరించారు. డీఎస్ఎస్.రావు, ఫోరం ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి చంద్రశేఖర్‌రావు, వరప్రసాద్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లేఅవుట్‌లోని పార్కింగ్ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు భారీ షెడ్డును నిర్మించి అద్దెలకు ఇచ్చుకున్నారని ఆరోపిస్తూ ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి హెచ్ఎండీఏ, ఉప్పల్ సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సానుకూలంగా స్పందించిన వారు డీసీ ఆంజనేయులుతో కలిసి షెడ్డును సీజ్ చేశారు. అనంతరం హెచ్ఎండీఏ ఎస్టేట్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేయగా.. 2–3 రోజుల్లో తొలగించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. హెచ్ఎండీఏ స్థలంలో నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని డీసీ స్పష్టం చేశారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులకు అందుబాటులోకి కొత్త వాహనం



కాప్రా: ఎల్లారెడ్డిగూడలోని ప్రత్యేక అవసరాలు కలిగిన అనురాగ్ స్కూల్ విద్యార్థుల కోసం నూతన వాహనాన్ని అందుబాటులోకి తెచ్చారు. మంగళవారం ఈ వాహనాన్ని స్కూల్ డైరెక్టర్ డా.రామ్ ఆధ్వర్యంలో సుచిర్ ఇండియా గ్రూప్ చైర్మన్ డా.వై కిరణ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. అనురాగ్ సంస్థ గత 20 ఏళ్లుగా తనకు తెలుసునని,నాటి నుంచి నేటి వరకు అదే స్ఫూర్తితో ముందుకెళ్తోందన్నారు. ఈ స్కూల్ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను చూసుకునే స్కూల్‌గా కాకుండా ఓ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌గా ఉండేలా అడుగులు వేయాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

లగచర్ల రైతులను బేషరతుగా విడుదల చేయాలి

ఆందోళన చేపట్టిన బీఆర్ఎస్ శ్రేణులు



గణేష్‌నగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు లగచర్ల రైతులను విడుదల చేయాలని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టాయి. అనంతరం గణేష్‌నగర్‌లోని డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. 'రైతులు తమ భూమి తమకే ఉండాలన్నందుకు వ్యతిరేకంగా తమ భూమిని ప్రభుత్వం తీసుకుంటుంటే ప్రతిఘటించిన పాపానికి కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల గిరిజన, దళిత, బలహీన వర్గాల రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం జైల్లో పెట్టిందని' దుయ్యబట్టారు.

భూములు రక్షించుకునేందుకు..

'మా భూములు మాకే కావాలన్నందుకు రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిని థర్డ్ డిగ్రీ టార్చర్లకు గురిచేశారని' ఆరోపించారు. రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేసి వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మహేష్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి రఘువర్ధన్‌రెడ్డి, మనోరంజన్‌రెడ్డి, జావీద్‌ఖాన్, నిర్మల, ప్రభు, జిలానిపాషా, ఆంజనేయులు, శంకర్, శ్రీనివాస్, రమేష్, సరస్వతి, లావణ్య, కల్యాణి, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ చౌరస్తాలో..

ఉప్పల్: లగచర్ల రైతుల అరెస్టులకు నిరసనగా ఉప్పల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు బన్నాల గీతాప్రవీణ్, పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతిసాయిజెన్‌శేఖర్ల ఆధ్వర్యంలో మంగళవారం ఉప్పల్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'ఇందిరమ్మ రాజ్యంలో రైతులను జైళ్లపాలు చేయడంతో పాటు సంకెళ్లు వేస్తున్నారని' తీవ్రంగా మండిపడ్డారు.

ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా.. ?

'ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా' అని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు కార్యకర్తలు నల్ల కండువాలు ధరించి నిరసన చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, సాయిజెన్‌శేఖర్, గంధం నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, బద్రుద్దీన్, వివిధ డివిజన్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, మహిళా నేతలు పాల్గొన్నారు.



ఉప్పల్ చౌరస్తాలో రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు, స్థానిక నేతలు

నాచారంలో జెడ్సీ పర్యటన



ఈఎస్ఐ ఆస్పత్రి నాలాను పరిశీలిస్తున్న జెడ్సీ హేమంత్

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్ పాటిల్ ఆకస్మికంగా పర్యటించారు. మంగళవారం నాచారం హెచ్ఎంటీనగర్ చెరువుపై ఈశాన్య భాగంలోని ఇందిరానగర్ వైపు చెరువుకట్టపై ఉన్న గుర్రపు డెక్క పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు. చెరువు కట్టపై వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. చెరువు కట్టపై పనిచేయని వీధిదీపాలకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో ఉన్న ఓపెన్ నాలాను పరిశీలించి పూడికతీత పనులను చేపట్టాలన్నారు. కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్, కాప్రా డీసీ జగన్, ఈఈ నాగేందర్, టౌన్‌ప్లానింగ్ డీసీపీ కృష్ణమోహన్, టీపీఎస్ రాంచందర్, ఏఈ కీర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు ముత్యంరెడ్డి, విఠల్‌యాదవ్, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస పూజతో పుణ్యఫలం



ప్రత్యేక అలంకరణగా సత్యదేవుని దర్శనం

రామంతాపూర్: ఇందిరానగర్‌లోని రమాసహిత సత్యనారాయణస్వామి దేవాలయంలో మంగళవారం ఉదయం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ధనుర్మాస ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు తిరుపతాచార్య, శేషాచార్య, సీతారామ ఆచార్యులు మాట్లాడుతూ.. ధనుర్మాసం విష్ణు దేవుడికి ప్రీతికరమైన మాసమని ఈ మాసంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తే పుణ్యఫలం దక్కుతుందని అభిప్రాయపడ్డారు. వైష్ణవాలయాల్లో ఈ మాసంలో ఉదయం సుప్రభాతానికి బదులుగా తిరుప్పావై గానం చేశారన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి విజయభారతి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కోట నరసింహారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కొనుగోలు చేయొద్దు



ప్రభుత్వ స్థల వివరాలను అడిగి తెలుసుకుంటున్న మేయర్

బోడుప్పల్: ప్రభుత్వ స్థలాలు కొనుగోలు చేసి మోసపోవద్దని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ సర్వేనంబర్ 63/26 నుంచి 63/38లోని ప్రభుత్వ స్థలాలను పరిశీలించేందుకు మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాన్ని భవిష్యత్తులో ప్రజా ప్రయోజనాలకు వినియోగిస్తామని, ఎవరూ క్రయ, విక్రయాలు చేయొద్దని, దళారుల వద్ద కొనుగోలు చేసి మోసపోవద్దని స్పష్టం చేశారు. సర్వే నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులోనూ క్రయవిక్రయాలు చేసి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనర్ రామలింగం, మేడిపల్లి తహసీల్దార్ హసీనా, కార్పొరేటర్లు నేతలు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి

యూజీడీ నిర్మాణానికి ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో నూతనంగా భూగర్భ డ్రైనేజీ నిర్మించాలని కోరుతూ సోమవారం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దండు సంతోష్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. గత కొన్నేళ్లుగా భూగర్భ డ్రైనేజీ శిథిలావస్థకు చేరడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తోందని, దీంతో ప్రజలు అంటువ్యాధుల భారినపడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే జలమండలి అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్నానాగేశ్వర్‌రావు, కాలనీప్రతినిధులు రామ్‌బ్రహ్మం, శ్రీకాంత్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



అల్వాల్: అల్వాల్‌కు చెందిన అజయ్‌కుమార్, శ్రావణిలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఏ–బ్లాక్ అధ్యక్షులు నిమ్మ అశోక్‌రెడ్డి అందజేశారు. డివిజన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, ఏ.శ్రీనివాస్‌గౌడ్, కె.శ్రీనివాస్‌గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కల్లు విక్రయాలపై చర్యలు తీసుకోండి

మల్కాజిగిరి: నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా కల్లు విక్రయిస్తున్న దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని ఇందిరానెహ్రూనగర్‌కు చెందిన నిర్వాహకులు లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్‌లు ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు చేశారు. ఇందిరానెహ్రూనగర్‌లో వారి దుకాణం వద్ద కాకుండా మీర్జాలగూడ ప్రాంతంలో వేరొకరు విక్రయిస్తున్నారని, గతంలో కూడా ఫిర్యాదు చేశామని, పట్టించుకోలేదన్నారు. సొసైటీలో సుమారు 110 మంది సభ్యులున్నారని, అక్రమ విక్రేతల కారణంగా నష్టపోతున్నామన్నారు. లైసెన్స్ ఉన్న ప్రాంతంలో కాకుండా వేరే చోట విక్రయిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోకపోతే ఉన్నతాధికారుల దృష్టికి, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తామని వివరించారు.



కార్పొరేటర్ శ్రవణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మల్కాజిగిరి: కాలనీలో సమస్యలు పరిష్కరించాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్‌కు షిరిడీసాయినగర్ కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. గతంలో యూజీడీ నిర్మాణం జరిగిందని,

స్థానిక సమస్యలు పరిష్కరించండి

మిగిలిన ప్రాంతాల్లో పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పూర్తి చేయాలన్నారు. యూజీడీ పూర్తయిన ప్రాంతంలో సీసీరోడ్ల నిర్మాణం, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, తాగునీటి సరఫరా తదితర సమస్యలపై కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆయన యూజీడీ, సీసీరోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఏఈ నవీన్‌కు సూచించామన్నారు. త్వరలోనే కాలనీలో పర్యటించి మిగిలిన సమస్యల పరిష్కారానికి కూడా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అజయ్‌జోషి, అచ్యుత్‌కుమార్, మురళీగౌడ్, బాబు, బాలక్రిష్ణ పాల్గొన్నారు.



పార్కుల ప్రహరీ శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్

దశలవారీగా పార్కుల అభివృద్ధి

బోడుప్పల్: దశలవారీగా పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. 21వ డివిజన్ పరిధిలోని బాలాజీ హిల్స్ కాలనీలో రూ.10లక్షలతో పార్కు ప్రహరీ నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కొన్ని పార్కుల్లో ఇప్పటికే జిమ్ వస్తువులు, బెంచీలు, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు నర్సింహరెడ్డి, సుమన్‌నాయక్, కాలనీవాసులు పాల్గొన్నారు.

'ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం'



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

బోడుప్పల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయడంలో విఫలమైందని బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి ఆరోపించారు. 'లగచర్ల ఘటనలో అక్రమంగా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని' మంగళవారం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాల్లో విఫలమైందని ధ్వజమెత్తారు. పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, నాయకులు కొత్త రవిగౌడ్, బందారం శ్రీధర్‌గౌడ్, కాటపల్లి రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



దీపక్

మల్కాజిగిరి: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సునీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్‌పేట్‌కు చెందిన బుసె దీపక్ (38) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. కాగా ఈనెల 13న భార్య జ్యోతితో గొడవపడ్డాడు. 16న ఆఫీస్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. తెలిసిన చోట వాకబు చేసిన ఫలితం లేకపోవడం, ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబసభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీపీసీఎల్ వద్ద కార్మికుల ఆందోళన



కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ 'భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్' (బీపీసీఎల్)లో గత రెండ్రోజులుగా కార్మికుల పని విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఇతర రాష్ట్రాల కార్మికులతో ప్లాంట్‌లో పనిచేయిస్తూ.. యాజమాన్యం తమ పొట్టకొడుతుందంటూ కార్మికులు ఆందోళన చేపట్టారు. మంగళవారం చర్లపల్లిలోని బీపీసీఎల్ ప్లాంట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. గత 25 ఏళ్లుగా సంస్థను నమ్ముకుని పనిచేస్తున్న తమను యజమాన్యం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తిరిగి యథావిధిగా పనులు కల్పించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా..

కార్మికుల ఆందోళన విషయం తెలుసుకున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి బీపీసీఎల్ వద్దకు చేరుకుని కార్మికులకు అండగా నిలిచారు. కార్మికులతో మాట్లాడి సమస్య తెలుసుకున్న ఆమె యజమాన్యంతో చర్చలు జరిపారు. కార్మికుల తొలగింపుపై ప్లాంట్ మేనేజర్ వేదప్రకాష్‌తో చర్చించారు. కాంట్రాక్టు గడువు ముగిసిందని అందుకే కొత్తవారిని నియమించుకున్నట్లు మేనేజర్ కార్పొరేటర్‌కు వివరించారు. దీనిపై ఆమె ఏకపక్ష నిర్ణయం సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్తానన్నారు. గడువు ముగిస్తే తిరిగి పొడగించాలని పేర్కొన్నారు.

భారీగా మోహరించిన కేంద్ర బలగాలు..

కార్మికుల ఆందోళన నేపథ్యంలో ముందస్తు చర్యలో భాగంగా బీపీసీఎల్ వద్ద కేంద్ర స్థానిక పోలీసులతో పాటుగా కేంద్ర బలగాలు పెద్దఎత్తున మోహరించాయి. ఆందోళన చేస్తున్న కార్మికులను చెదరగొట్టారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ సెక్రటరీ శేఖర్‌రెడ్డి

మల్లాపూర్: లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ సెక్రటరీ శేఖర్‌రెడ్డి నాచారంలో మంగళవారం 200 మంది పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లను అందజేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చర్యలు చేపట్టేందుకు మైక్‌తో పాటు సీసీకెమెరాను మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్‌కు అందజేశారు. అనంతరం కార్మికులకు వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ క్రిష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. విందు, వినోదాల కోసం కాకుండా సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వైస్ గవర్నర్ ఇన్నారెడ్డి, కృష్ణారెడ్డి, నాచారం మహంకాళి దేవాలయం చైర్మన్ కృష్ణారెడ్డి, లయన్స్ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, సదానందం, విజయ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కృష్ణానగర్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక



కుషాయిగూడ: మీర్‌పేట్, హెచ్‌బీకాలనీ డివిజన్, కృష్ణానగర్ కాలనీ అధ్యక్షుడిగా మల్లారెడ్డి ఎన్నికయ్యారు. ప్రత్యర్థిపై 100 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా ఎంఎస్ఎన్.మూర్తి, రాజయ్య, మహిళ ఉపాధ్యక్షులుగా జయమ్మ, ప్రధాన కార్యదర్శిగా దేవరాజ్, కోశాధికారిగా అంజయ్య, జాయింట్ సెక్రటరీలుగా బాలయ్యగౌడ్, శ్రీనివాస్, శ్యామ్‌సుందర్, మహిళా సెక్రటరీగా కృష్ణవేణి, కల్చరల్ సెక్రటరీగా వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అనంతచారీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ.. తనపై విశ్వాసంతో అధ్యక్షుడిగా గెలిపించిన కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో కాలనీని అభివృద్ధి పథంలో నిలిపేందుకు తన శాయశక్తుల కృషిచేస్తానన్నారు. అనంతరం నూతన కమిటీ ప్రతినిధులు కార్పొరేటర్ ప్రభుదాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేల గళం

● ఎస్‌డీఎఫ్ నిధులపై మర్రి రాజశేఖర్‌రెడ్డి ● ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిపై బండారి లక్ష్మారెడ్డి

మల్కాజిగిరి: నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఖర్చు చేయడంలో ఎమ్మెల్యేలను భాగస్వాములు చేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక నిధులు ఖర్చు చేయడానికి ఇన్‌చార్జి మంత్రులను ఏర్పాటు చేశారని దీనికేదైనా చట్టబద్ధత ఉందా.. ? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించడం హర్షణీయమైనా వాటిని ఖర్చు చేయడంలోనే సమస్య ఉందన్నారు. మంత్రులకే అధికారం ఉంటే వాటిని ఏ విధంగా ఖర్చు చేస్తారన్నారు.

◆ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రాజీవ్ గృహకల్ప సముదాయంలో సుమారు 1799 కుటుంబాలు నివసిస్తున్నాయని, ఇప్పటి వరకు తాగునీటి సౌకర్యం కూడా లేని పరిస్థితి ఉందన్నారు.

రైల్వే క్రాసింగ్‌తో ఇబ్బందులు..

అనేక చోట్ల రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని అక్కడ ఆర్‌ఓబీ, ఆర్‌యూబీలను నిర్మించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇన్‌చార్జి మంత్రి ప్రత్యేక నిధులను ఎమ్మెల్యే ప్రమేయం లేకుండా ఏ విధంగా నిధులను ఖర్చు చేస్తారో తెలియజేయాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో సుమారు 1700 మంది విద్యార్థులు చదువుతున్నారని, సరైన బిల్డింగ్స్ లేకపోవడం వల్ల షిఫ్ట్ పద్ధతిలో నడిపించాల్సిన పరిస్థితి ఉందన్నారు. నిధులు సరైన వాటికి ఖర్చు చేయాల్సిన బాధ్యత ఉందని, ఆ దిశలో ఇన్‌చార్జి మంత్రి సహకరిస్తారని, ఆశిస్తున్నామన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించండి..

సాక్షి,సిటీబ్యూరో: అసెంబ్లీ నియోజకవర్గాలకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ కేటాయించాలని, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.మంగళవారం శాసనసభ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీకి ప్రాతినిధ్యం లేని నియోజకవర్గాల్లో ఇన్‌చార్జ్ మంత్రుల ఆధ్వర్యంలో అధికారులు పనిచేస్తున్నారని, అభివృద్ధి కార్యక్రమాలను రాజకీయాలకు అతీతంగా చేపట్టాలని సూచించారు.

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిపై..

కాప్రా: ఉప్పల్ నియోజకవర్గం సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గళమెత్తారు. దాదాపు ఏడాది కాలంగా నియోజకవర్గంలోని పలు కాలనీలు, స్ట్రీట్‌లైట్లకు నోచుకోవడం లేదన్నారు. చర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదురౌతున్నాయని, తక్షణమే వాటిపై దృష్టి సారించాలని కోరారు. చర్లపల్లిలో మూడు చెరువులు ఉన్నాయని, వాటి పూడికతీత చర్యలు చేపట్టాలని, పేరుకుపోయిన గుర్రెపుడెక్కను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి